క్లుప్తంగా

వీడీసీ ఆగడాలను అరికట్టాలి

నిజామాబాద్ సిటీ: జిల్లాలోని పలు గ్రామాల్లో వీడీసీల ఆగడాలు మితిమీరుతున్నాయని, వాటిని అణచివేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. అనంతరం సీపీఎం నాయకులు రమేష్‌బాబు మాట్లాడుతూ..వీడీసీపై చర్యలు ప్రకటనలకే పరిమితం అవుతున్నాయన్నారు. సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్‌వెస్లీతోపాటు ప్రజాసంఘాల రాష్ట్ర బాధ్యులు ఈ నెల 12న తాళ్లరాంపూర్ గ్రామాన్ని సందర్శించి వాస్తవ పరిస్థితులు తెలుసుకున్నారని తెలిపారు. నాయకులు పెద్ది వెంకట్రాములు, నూర్జహాన్, రాములు, శేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల సీజ్


ఇళ్లను సీజ్ చేస్తున్న తహసీల్దార్ మాలతి

ధర్పల్లి: మండల కేంద్రంలో ఖాళీగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను రెవెన్యూ అధికారులు బుధవారం సీజ్ చేసి తాళాలు వేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అధికారులు సకాలంలో పంపిణీ చేయడం లేదని ఆగ్రహించిన ప్రజలు కొన్ని రోజుల క్రితం ఇళ్ల తాళాలు పగలగొట్టి చొరబడ్డారు. అదే రోజు ఇళ్లలోకి చొరబడిన వారిని అధికారులు సముదాయించి బయటకు పంపించారు. ఈ నేపథ్యంలోనే ఇళ్లను సీజ్ చేసి తాళం వేసినట్లు తహసీల్దార్ మాల తెలిపారు. వసతులు కల్పించి అర్హులను గుర్తించి కలెక్టర్ ఆధ్వర్యంలో ఇళ్లను పంపిణీ చేస్తామన్నారు. ఆర్ఐ రాజేశ్వర్ తదితరులున్నారు.

సంతాప సభ విజయవంతం చేయండి



డిచ్‌పల్లి: కార్మిక ఉద్యమ నాయకుడు చెల్ల మురళి సంతాప సభను విజయవంతం చేయాలని సీపీఎం(ఎంఎల్) న్యూడెమొక్రసీ మండల కార్యదర్శి జేపీ గంగాధర్ కోరారు. మంగళవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలో చెల్ల మురళి సంతాప సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేపీ గంగాధర్ మాట్లాడుతూ.. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నాలుగున్నర దశాబ్దాల పాటు ఎన్నో పోరాటాలు చేసిన మురళి ఏప్రిల్ 1న మరణించారని తెలిపారు. బుధవారం (17న) సాయంత్రం 6 గంటలకు బోర్గాం(పి) శ్రామిక నగర్ లో సంతాప సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



జక్రాన్‌పల్లి: కొలిప్యాక్‌లో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు బుధవారం పంపిణీ చేశారు. గ్రామంలోని ఎనిమిది మంది లబ్ధిదారులకు రూ.2 లక్షల 20వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మద్దుల రమేష్, నాయకులు సాగర్, రవిగౌడ్, శంకర్, సాయిగౌడ్, ప్రేమ్‌కుమార్, అమృత్, తిరుపతి, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



ఖలీల్‌వాడి: 18వ ఆల్ ఇండియా పోలీస్ షూటింగ్(స్పోర్ట్స్) ఛాంపియన్ షిప్- 2024 జాతీయస్థాయిలో సిల్వర్ మెడల్ సాధించిన ఏఆర్ మహిళ కానిస్టేబుల్ మాధవిని సీపీ సాయిచైతన్య బుధవారం అభినందించారు. గత నెల మార్చి 24 నుంచి 29 వరకు జాతీయ స్థాయిలో మధ్య ప్రదేశ్ రాష్ట్రంలో పోటీలు నిర్వహించారు. రైఫిల్ క్రీడలో తెలంగాణ రాష్ట్రం నుంచి మహిళా పోలీస్ కానిస్టేబుల్ మాధవి ప్రాతినిధ్యం వహించారు. ఈ క్రీడలలో మాధవి సిల్వర్ మెడల్ అందుకున్నారు. ప్రశంసా పత్రాన్ని సీపీ పి.సాయి చైతన్య ద్వారా తీసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. జాతీయస్థాయిలో తెలంగాణ పేరు నిలబెట్టడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రాతినిధ్యం వహించి ఎన్నో మెడల్స్ సాధించి తీసుకురావాలని ఆకాంక్షించారు. రిజర్వు సీఐలు శ్రీనివాస్(అడ్మిన్), తిరుపతి(వెల్ఫేర్) తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన ఏదీ?

- ఉదయం 11 గంటలైనా ఆఫీసులకు రాని బల్దియా ఉద్యోగులు
- బయోమెట్రిక్ అటెండెన్స్‌కు స్వస్తి


బల్దియా కార్యాలయం

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆఫీస్ టైమింగ్. అయితే ఉదయం 11 గంటలు దాటినా చాలా మంది కార్పొరేషన్‌లో కాలు పెట్టడం లేదు. నిదానంగా వచ్చి 11.30 వరకు అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు చేస్తున్నారు. కొన్ని విభాగాలకు చెందిన సిబ్బంది మాత్రం సమయపాలన గాలికివదిలివేశారు. మెప్మా, రెవెన్యూ, ఇంజినీరింగ్, అకౌంటింగ్, ఎన్నికల నిర్వహణ వంటి విభాగాల్లో చాలా మంది ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదు. కొందరు ఉద్యోగులు ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారు ప్రతిరోజు గంట ఆలస్యంగా వస్తున్నా పై అధికారులు కిమ్మనడంలేదు.

గంటల తరబడి వెయిటింగ్..

ఉదయం సమయంలో పనులు వెంటనే ముగించుకుని వెళ్లాలనుకుని బల్దియా కార్యాలయానికి వచ్చేవారికి మాత్రం గంటల తరబడి నిరీక్షణ తప్పడం లేదు. కంప్యూటర్ ఆపరేటర్లు, సిబ్బంది కూడా రావడం లేదు. కేవలం అటెండర్లు మాత్రమే సమయపాలన పాటిస్తున్నారు. కార్యాలయాల విభాగాల అధిపతులు కూడా సమయపాలన పాటించకపోవడం గమనర్హం. బల్దియా కార్యాలయానికి ఉదయం 11 దాటినా రాని సిబ్బంది సాయంత్రం 5 అయిందంటే మాత్రం ఒక్కరు కనపడరు. మధ్యాహ్నం భోజనం కోసం గంట నుంచి గంటన్నర కేటాయిస్తున్నారు. కొందరు ఉద్యోగులు ఇంటికి వెళ్లి లంచ్ చేసి 3 నుంచి 3.30కు తిరిగి వస్తున్నారు. ఈ సమయంలో బల్దియాకు వచ్చిన వారికి గంటన్నర ఎదురుచూడక తప్పడం లేదు.

బయోమెట్రిక్ ఊసే లేదు

గత కమిషనర్ చిత్రామిశ్రా హయాంలో ఉద్యోగులు తంచనుగా సమయపాలన పాటించేవారు. ఆలస్యంగా వచ్చినవారికి ఆ రోజు ఆబ్సెంట్ వేసేవారు. దాంతో ఉద్యోగులు కచ్చితంగా సమయపాలన పాటించేవారు. తర్వాత వచ్చిన ఉన్నతాధికారులు ఉద్యోగుల సమయపాలనను పట్టించుకోకపోవడంతో సమయపాలన పాటించడం లేదు. గతంలో ఉన్న బయోమెట్రిక్ విధానాన్ని తీసివేయడంతో ఉద్యోగులకు మరింత అవకాశం దక్కింది.

త్వరలో ఐరిస్ అటెండెన్స్



బల్దియా ఉద్యోగులను సమయపాలన పాటించాలని ఇదివరకు చాలాసార్లు సూచించాం. సర్కులర్ కూడా జారీ చేశాం. కొందరు రెగ్యులర్‌గా ఆలస్యంగా వస్తున్నట్లు తెలిసింది. త్వరలోనే ఐరిస్ ద్వారా అటెండెన్స్ విధానం ప్రవేశపెడతాం. – ఎస్.దిలీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

ఆస్పత్రుల అడ్డా ఖలీల్‌వాడి

- రోగుల సంఖ్య పెరగడంతో ఖలీల్‌వాడి ప్రాంతంలో పెరిగిన ట్రాఫిక్ బెడద
- ఆస్పత్రుల్లో పార్కింగ్‌కు స్థలం లేకపోవడంతో రోడ్లపైనే వాహనాలు


నగరంలోని ఖలీల్‌వాడి ప్రాంతం

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ప్రధాన ప్రాంతం ఖలీల్‌వాడి. ఈ ప్రాంతంలో అనేక ప్రైవేట్ ఆస్పత్రులు ప్రజలకు వైద్యం అందిస్తున్నాయి. ఇక్కడ అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండటంతో జిల్లాతోపాటు కామారెడ్డి, నిర్మల్, మహారాష్ట్రలోని ధర్మాబాద్ ప్రాంతం నుంచి అనేక మంది ఇక్కడికి వచ్చి వైద్యసేవలు పొందుతారు. గతంలో గుండె, కిడ్నీ, న్యూరో, కాన్సర్ సంబంధిత పెద్ద రోగాలకు హైదరాబాద్‌కు వెళ్లేవారు. కానీ ఇప్పుడు అలాంటి సేవలు ఖలీల్‌వాడిలోనే అందుబాటులోకి వచ్చాయి. దీంతో జిల్లాతోపాటు ఇతర జిల్లాకు వచ్చిన వారు ఇక్కడే వైద్యం చేయించుకుంటున్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు..

ప్రతి రోజు ఆస్పత్రులకు వచ్చేవారి సంఖ్య పెరగడంతో ఖలీల్‌వాడి ప్రాంతం రద్దీగా మారుతోంది. పేషంట్లతో పాటు అటెండర్స్ వాహనాలతో రావడం, బస్టాండ్ నుంచి ఆటోలు, ద్విచక్ర వాహనాలలో రావడంతో ఈ ప్రాంతం కిక్కిరిపోతుంది. ఆస్పత్రుల ముందు వాహనాలను నిలిపేందుకు పార్కింగ్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. చాలా ఆస్పత్రుల్లో పార్కింగ్‌కు స్థలం లేకపోవడంతో రోగులు, సహాయకులకు సంబంధించిన వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయమేర్పడుతోంది.

ఉపాధి అవకాశాలు..

ఖలీల్‌వాడిలో ఆస్పత్రులు ఉండటంతో మెడికల్ షాపులు, హోటళ్లు, కిరాణాషాపులు, పండ్ల దుకాణదారులకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. పలువురు తోపుడు బండ్లు, చిన్న, చిన్న బండ్లపై కూడా హోటళ్లను నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నారు.

అందుబాటులో అన్నిరకాల వైద్య సేవలు



ఖలీల్‌వాడిలో అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. గతంలో ఇలాంటి మల్టీ, కార్పొరేట్ ఆస్పత్రులు అందుబాటులో లేవు. గత పదేళ్లలో పెద్ద ఆస్పత్రుల సంఖ్య కూడా పెరిగింది. ఇప్పుడు అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి.
– పందరి, కోటగల్లీ, నిజామాబాద్

బయో మెడికల్ వ్యర్థాలపై నిర్లక్ష్యమేల?


పశువైద్యశాలలో బయో వ్యర్థాలను ఒకే డబ్బాలో వేస్తున్నారని చూపుతున్న పర్యావరణ వేత్త సుధీర్

డొంకేశ్వర్(ఆర్మూర్): నగరంలోని కోటగల్లి పశు వైద్యశాలలో బయో మెడికల్ వ్యర్థాలను సిబ్బంది ఇష్టానుసారంగా పారవేస్తున్నారని పర్యావరణ వేత్త సుధీర్‌సింగ్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశువులకు వైద్యం చేసిన తర్వాత సూదులు, వాయిల్స్, దూది ముక్కల(బయో వ్యర్థాలు)ను అన్ని ఒకే డబ్బాలో వేస్తున్నారని తెలిపారు. నిబంధనల ప్రకారం వ్యర్థాలు వేయడానికి ఎరుపు, తెలుపు, నీలం రంగు డబ్బాలు ఉన్నప్పటికీ వేరే డబ్బాలను వాడుతున్నారన్నారు. అలాగే ఇందులో వేసిన వ్యర్థాలను ప్రత్యేక వాహనంలో కాకుండా మున్సిపాలిటీ వ్యానులో వేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ కాలనీలో సాయిబాబా గుడి వద్ద ఒక ఆవు కొంతకాలంగా అనారోగ్యంలో ఉందని పశువైద్య అధికారులకు 1962 నంబర్‌కు ఫోన్ చేసినా వారు స్పందించడం లేదన్నారు. ఉన్నతాధికారులు ఈ విషయాలపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న అధికారులు

ధర్పల్లి: సీతాయిపేట్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను మండల ప్రత్యేక అధికారి, డీఎల్‌పీవో శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. ఇళ్ల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన లబ్ధిదారులకు సూచించారు. ఇందిరమ్మ మోడల్ హౌజ్ ప్రకారం నిర్మాణాలను చేపట్టాలని, దశలవారీగా లబ్ధిదారులకు డబ్బులు చెల్లిస్తామని డీఎల్‌పీవో పేర్కొన్నారు. ఎంపీడీవో బాలకృష్ణ, జీపీ సెక్రెటరీ కృష్ణ ఉన్నారు.

ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం


మాట్లాడుతున్న డీఈవో అశోక్

నిజామాబాద్ అర్బన్: ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. ఏబీవీపీ ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థ.. విద్యార్థులలో దేశభక్తి జాతీయ భావాలు పెంపొందిస్తూ ఎంతోమంది దేశభక్తులకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఇలాంటి ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న ఏబీవీపీ నేతలకు అభినందనలు తెలిపారు. విభాగ్ సంఘటన మంత్రి రాజు సాగర్, ఇందూరు విభాగ్ కన్వీనర్ కైరి శశిధర్, ఇందూరు జిల్లా వ్యవస్థ ప్రముఖ్ సురేందర్ రెడ్డి, నగర అధ్యక్షులు వెంకటకృష్ణ, కంఠేశ్వర్ జోనల్ ఇంచార్జ్ దుర్గా దాస్, ఉచిత పాలిటెక్నిక్ తరగతుల కన్వీనర్ సాయి రంజిత్, దితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి


పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాములు

మోపాల్: మండలంలోని నర్సింగ్‌పల్లిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పనుల్లో వేగం పెంచాలని ఎంపీడీవో రాములు నాయక్ సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన గ్రామంలో లబ్ధిదారులతో కలిసి ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలించారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ.. నర్సింగ్‌పల్లి గ్రామానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, పనులు ఇంకా ప్రారంభించని వారు వెంటనే ప్రారంభించాలని తెలిపారు. పనులు ప్రారంభమైన ఇళ్లు బేస్‌మెంట్ లెవల్, పిల్లర్ల దశలో ఉన్నాయన్నారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, లబ్ధిదారులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకష్టహర చతుర్థి పూజలు


సిద్ధివినాయక ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నిజామాబాద్ రూరల్: నగరంలోని గణపతి ఆలయాల్లో సంకష్టహర చతుర్థిని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సార్వజనిక్ గణేష్ మండలి మహాగణపతి ఆలయం(బొడ్డెమ్మచెరువు వద్ద), గాయత్రినగర్‌లోని సిద్ధివినాయక స్వామి దేవాలయం, మున్సిపల్ కార్యాలయం వద్ద గల శుభం కరోతి గణపతి ఆలయం, బోర్గాం గ్రామ పరిధిలో గల శ్రీలక్ష్మీగణపతి మహా ఆలయాల్లో సంకష్ట చతుర్థి పర్వదినం అత్యంత కనుల పండువగా నిర్వహించారు.

పల్లకీసేవ నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదం, అన్నప్రసాదం అందజేశారు. ఆలయ నిర్వాహకులు భూషణ్‌చారి, మచ్చ చంటయ్య, అరుణ్ కుమార్ శర్మ, తదితరులున్నారు.

నాలుగు గ్రామాల్లో సంవిధాన్ యాత్ర


పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరికొండ: పెద్దవాల్గోట్, కొండూర్, పోత్నూర్, సర్పల్లి తండాలో కాంగ్రెస్ నాయకులు జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర బుధవారం నిర్వహించారు. గాంధీజీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్కోల్ భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి ఎర్రన్న, మండలాధ్యక్షుడు బాకారం రవి, గాధారి నర్సారెడ్డి, సంతోష్‌నాయక్, రూరల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్, రాంరెడ్డి, రాజారెడ్డి, సురేష్ రెడ్డి, లియాఖత్ అలీ, నర్సింగ్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే నెల సెలవు ప్రకటించాలి


మాట్లాడుతున్న రమేష్‌బాబు

నిజామాబాద్ సిటీ: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు మే నెలలో సెలవులు ప్రకటించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ.. ఏప్రిల్ నెలలోనే ఎండలు తీవ్రంగా ఉన్నాయని, మే నెలలో ఎండ వేడిమిని భరించడం కష్టంగా మారుతుందన్నారు. సెంటర్లకు చిన్న పిల్లలను తల్లిదండ్రులు పంపించరని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలతోపాటు అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా సెలవులివ్వాలని కోరారు. ఈ నెల 24న జరిగే ధర్నాలో టీచర్లు, ఆయాలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. నాయకులు పి.స్వర్ణ, సునీత, లావణ్య, లలిత పాల్గొన్నారు.

మెడికవర్‌లో అరుదైన చికిత్స


మాట్లాడుతున్న డాక్టర్ రవికిరణ్

నిజామాబాద్‌నాగారం: నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో పలువురికి అరుదైన చికిత్స చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆస్పత్రిలో డాక్టర్ రవి కిరణ్ మాట్లాడారు. నిజామాబాద్ మండలంలోని కాలూరుకి చెందిన అంజయ్య(53), ఇందల్వాయి మండలం అన్సాన్‌పల్లికి చెందిన మల్లయ్య(50) కాళ్లల్లో తీవ్రమైన నొప్పితో బాధపడుతూ వైద్యులను సంప్రదించారన్నారు. వీరిని పరీక్షించగా కాళ్ల రక్తనాళాల్లో రక్తం గడ్డ కట్టిందని గుర్తించామని తెలిపారు. దీంతో వైద్యులు స్టంట్ వేసి రక్తప్రసరణను సాధారణ స్థితికి తీసుకువచ్చారని వివరించారు. ఇప్పుడు పేషెంట్లు ఎటువంటి ఇబ్బంది లేకుండా నడవగలుగుతున్నారని, ఇటువంటి ఫెరిపెరల్ ఇంటర్వెన్షన్ చికిత్స ఎటువంటి కోత లేకుండా చిన్న రంధ్రం ద్వారా చేయటం నిజామాబాద్ జిల్లాలో మొట్టమొదటిసారిగా మెడికవర్ ఆస్పత్రిలో చేసినట్లు తెలిపారు. సెంటర్ హెడ్ స్వామి, మార్కెటింగ్ హెడ్ వినయ్ కుమార్, డీఎంఎస్ యజ్ఞ పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

నిజామాబాద్ రూరల్: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో సౌందర్య అన్నారు. గూపన్‌పల్లిలో బుధవారం పోషణ్ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో సౌందర్య మాట్లాడారు. ఆకుకూరలు, పండ్లు, పప్పు దినుసులులో ప్రోటీన్ అధికంగా ఉంటాయని అన్నారు. అదేవిధంగా గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు అన్నప్రాశన, అక్షరాభ్యాసం చేయించారు. గూపన్‌పల్లి నాయకులు చిటికెల శ్రీనివాస్ రెడ్డి, సూపర్‌వైజర్ సీతాకుమారి, ఏఎన్‌ఎం రాధ, తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	94,200	వెండి(కిలో)	1,01,000
22 క్యారెట్స్	86,950	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్సడ్	200
	(కిలోకు)	లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	గాజరుగడ్డ	40	80
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	60	80
బీరకాయ	40	60	దోసకాయ	25	50
దొండకాయ	25	50	ఆలుగడ్డ	30	60
బీర్నీసుకాయ	80	120	గోబిగడ్డ	10	20
కాకరకాయ	50	90	గోబిపువ్వు	25	50
వంకాయ	25	50	బీట్‌రూట్	20	40
పాలకూర	20	40	కరివేపాకు	70	120
మెంతికూర	60	90	చామగడ్డ	40	60
కొత్తిమీర	30	60	గోరుచిక్కుడు	60	80
పుదీనా	40	60	చిక్కుడుకాయ	60	80
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)
- స్క్రీన్-1 జాక్(తెలుగు)-10.45, 1.30, 4.20, 7.20, 10.20
- స్క్రీన్-2 గుడ్ బ్యాడ్ అగ్లీ(తెలుగు)-1.40, 10.20
- ఫలక్‌నుమా దాస్(తెలుగు)-4.30
- అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి(తెలుగు)-7.30
- స్క్రీన్-3 జాట్(హిందీ)-11.00, 1.40, 7.30
- అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి -4.30, 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
- స్క్రీన్-1 గుడ్ బ్యాడ్ అగ్లీ(తెలుగు)-10.40, 1.35, 7.15, 10.10
- మ్యాడ్ స్క్వేర్(తెలుగు)-4.30
- స్క్రీన్-2 జాక్(తెలుగు)-10.20, 1.15, 4.10, 7.05, 10.00
- స్క్రీన్-3 జాట్(తెలుగు)-10.00, 1.10, 4.20, 7.30, 10.40
- స్క్రీన్-4 అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి -10.05, 1.10, 4.15, 10.25
- ఫలక్‌నుమా దాస్(తెలుగు)-7.15

లలితామహల్ జాక్ (తెలుగు)
దేవి గుడ్ బ్యాడ్ అగ్లీ (తెలుగు)
నటరాజ్ జాట్(హిందీ), విజయ్ మ్యాడ్ స్క్వేర్

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ నర్సారెడ్డి

జక్రాన్‌పల్లి: బ్రాహ్మణ్‌పల్లిలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ కాటిపల్లి నర్సారెడ్డి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ్‌పల్లి మాజీ సర్పంచ్ మాదరి దేవరాజ్, సొసైటీ వైస్ చైర్మన్ బైరి లక్ష్మణ్, డైరెక్టర్లు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఖలీల్ వాడి: అగ్నిమాపక శాఖ వారోత్సవాల సందర్భంగా నగరంలోని గంజ్ రోడ్డులో గల ఓ అపార్ట్‌మెంట్‌లో ఎల్పీజీ సిలిండర్ నుంచి మంటలు వస్తే ఎలా ఆర్పి వేయాలో మహిళలకు బుధవారం అవగాహన కల్పించారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అగ్నిమాపక శాఖాధికారి నర్సింగ్ రావు, సిబ్బంది కె.మధు, జి. ప్రశాంత్, సురేందర్, సూరజ్, కిరణ్, ప్రశాంత్ గౌడ్, సిబ్బంది ఉన్నారు.

ఇండియన్ బ్యాంక్ బ్రాంచ్ నూతన భవనం ప్రారంభం


ప్రారంభిస్తున్న బ్యాంక్ మేనేజర్ ప్రశాంత్

ఇందల్వాయి: సిర్నాపల్లిలో ఉన్న ఇండియన్ బ్యాంక్ బ్రాంచ్‌ను నూతన భవనంలోకి మార్చినట్లు మేనేజర్ ప్రశాంత్ తెలిపారు. ఖాతాదారుల సౌలభ్యం కోసం నూతనంగా ఏర్పాటు చేసిన భవనంలోకి బ్యాంకు శాఖని మార్చామని ఖాతాదారులు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు. ఫీల్డ్ జనరల్ మేనేజర్ ఎం. సుబ్బారావు, కరీంనగర్ జోనల్ మేనేజర్ కె. రాజ్ కుమార్, బ్యాంకు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఏలకు వేతనాలు చెల్లించాలి

కమ్మర్‌పల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలోని ఫీల్డ్ అసిస్టెంట్‌లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని కమ్మర్‌పల్లి ఎంపీడీవో, తహసీల్దార్‌లకు వినతి పత్రం అందజేశారు. తమను ఎఫ్‌టీఈలుగా కన్వర్ట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. హరీష్, రమ, తదితరులున్నారు.